మెప్మాలో నిధుల స్వాహాపై విచారణ జరపండి:సీపీఐ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో జరిగిన నిధుల స్వాహా ఘటనపై విచారణ జరపాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఏరియా కార్యదర్శి జనమా గురవయ్య డిమాండు చేశారు. విశాలాంధ్రలో మంగళవారం 'మహిళా ఉద్యోగి చేతి వాటం... మెప్మాలో రూ.20లక్షలు నిధులు స్వాహా...?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనమాల గురవయ్య సీపీఐ నేతలతో కలసి శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనరు రమేష్ బాబును కలసి మెప్మాలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో మెప్మా అధికారులు సీయంయం ప్రసాద్, సీవో షేక్ అజుజునీషా వీరు ఇరువురు కలిసి మెప్మా వెబ్ సైట్ లో ఆదర్శ మేరీ (ఎస్ హెచ్ జీ)12 మంది సభ్యుల ఆధార్ సీడింగ్ చేశారన్నారు. ఇందులో నగరి పరిధిలోని టీ ఆర్ కండ్రిగకు చెందిన కె.లక్ష్మి, ఎస్.వరలక్ష్మితో పాటు బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఎస్ కే హసీనా, షేక్ మైమూన్ ఉన్నారన్నారు. వీరు నలుగురు స్థానికేతరులని ఆయన తెలిపారు. వీరే కాకుండా శ్రీకాళహస్తి పట్టణం శ్రీరాంనగర్ చెందిన పి మాధవి... ఎం ఎం వాడ కు చెందిన షేక్ ఖాదర్ బీ... పీ వీ రోడ్ లో మల్లిక, మున్నబేగం, మనీషా, జ్యోతి, పర్వీన్ కొండమిట్టలో బి లలిత ఉన్నారన్నారు. వీరి వివరాలు వీఎంసీ కూడలిలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఇచ్చారన్నారు. ఆధార్ కార్డుల్లో ఫోటోలకు వీరు ఇచ్చిన పాస్ పోర్ట్ ఫోటోలకు సంబంధమే లేదని గురవయ్య తెలిపారు. పట్టణంలోని 9వ వార్డులో ఆర్ పీకి సంబంధమే లేకుండా ఆర్ పీ లాగిన్ లో ఆధార్ సీడింగ్ చేశారన్నారు. 2022నవంబరులో ఆ జాబితాను బ్యాంక్ వారికి ఇచ్చిన గ్రూప్ లెటర్ లో గ్రూప్ సీల్ (ఆదర్శ మహిళ గ్రూప్) పేరు మీద ఇచ్చారన్నారు. కమ్యూనిటీ ఆర్గనైజరు షేక్ అజుజునీషా, బ్యాంక్ వారు మెప్మా ఆధార్ సీడింగ్ లో వున్నవారిని పరిశీలించకుండా ఏకంగా రూ.20 లక్షలు రుణం మంజూరు చేశారని ఆయన తెలిపారు. ఈ సొమ్మును ఈ ఎనిమిది మంది ఖాతాలోకి బదిలీ చేసి... వారి ప్రమేయం లేకుండా నగదు విత్ డ్రా చేశారన్నారు. ఈ రూ.20 లక్షలు సీవో షేక్ అజుజునీషా స్వాహా చేశారని తమ అనుమానం అని ఆయన తెలిపారు. శ్రీకాళహస్తి మునిసిపాలిటీ పరిధిలో మెప్మా అధికారి సీయంయం ప్రసాద్ కు తెలియకుండానే ఇది జరగడానికి వీలు లేదన్నారు. రాజకీపార్టీల అండ దండలతో గ్రూపులను అడ్డు పెట్టకొని అడ్డదిడ్డంగా నిధులు స్వాహా చేస్తున్నారని గురవయ్య ఆరోపించారు. ఈ కారణంగా అమాయక గ్రూప్ మహిళలు బలైపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పురపాలక, మెప్మా అధికారులు స్పందించి ఈ అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ నేతలు రొద్దా గోపి, మించల శివకుమార్, రుద్రపాక శ్రీనివాసులు, ధనంజయులు, శంకర తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర కథనం సంచలనం
మెప్మాలో నిధుల స్వాహాపై విచారణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విశాలాంధ్ర కథనం సంచలనం సృష్టించింది. ఈ కథనంపై స్పందించిన జిల్లా అధికారులు వెంటనే విచారణ చేపట్టారు. విశాలాంధ్రలో మంగళవారం 'మెప్మాలో రూ.20లక్షలు నిధులు స్వాహా..?' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంపై తిరుపతి జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు తీవ్రంగా స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరుపతి నుంచి శ్రీరాములు, బాబా, వెంకట్రమణ అనే అధికారులు శ్రీకాళహస్తికి వచ్చారు. రుణం మంజూరు చేసిన బ్యాంకులో అధికారులను కలసి సమాచారం సేకరించారు.అదేవిధంగా శ్రీకాళహస్తి మెప్మా కార్యాలయంలో రికార్డులు తనిఖ చేశారు. సంఘం సభ్యులను కూడా విచారించారు. ఈ విచారణ నివేదిక ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. ఈ విషయమై శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనరు రమేష్ బాబును 'విశాలాంధ్ర' వివరణ కోరగా విశాలాంధ్రలో ప్రచురితమైన కథనంపై మెప్మా అధికారులు విచారణ చేస్తున్నారని నిధులు దుర్వినియోగం అయినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా మెప్మాలో అవినీతిపై విశాలాంధ్రలో ప్రచురితమైన కథనం శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపితే మరింత అవినీతి బయట పడుతుందని ప్రజలు చెబుతున్నారు. కాగా విచారణకు వచ్చిన అధికారులు శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలో పని చేసే కొంతమంది ఆర్పీలను కూడా విచారించారు. ఈ సందర్భంగా వారు మెప్మాలో జరిగిన నిధుల స్వాహాకు సంబంధించి సాక్ష్యాలతో సహా అందజేశారు. వీరి స్టేట్ మెంటు కూడా అధికారులు నమోదు చేసుకున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు మహిళా ఉద్యోగిని కూడా వారు విచారించారు. తాను ఒత్తిడిలో ఉన్న సమయంలో ఇలా పొరబాటు జరిగిందని ఆమె విచారణ అధికారులకు చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ అవినీతిపై అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

క్రెడిట్ ఔట్ రిచ్ 2023 సద్వినియోగం చేసుకోవాలి: ఏపీజీబీ మేనేజర్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో బుధవారం నిర్వహించనున్న క్రెడిట్ ఔట్ రిచ్ 2023 కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బీసీఎస్ రోడ్డులోని ఏపీజీబీ బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరు డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో తిరుపతి, నెల్లూరు జిల్లాలకు సంబంధించి గూడూరు పట్టణంలో బుధవారం ఉదయం క్రెడిట్ ఔట్ రిచ్ 2023 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీజీబీ బ్యాంక్ ఛైర్మన్ రాకేష్ కశ్యప్,రీజనల్ మేనేజర్ టీ. మోహన్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఏపీజీబీ అందిస్తున్న సేవలను ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఉద్యోగులు వ్యాపారస్తులు, రైతులు, వాహనాలు కొనుగోలు చేసేవారికి ప్రత్యేకంగా రుణాలు సరళమైన వడ్డీరేట్లకు అందిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీజీబీ నెల్లూరు మెయిన్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ జీ. సాయినాథ్, నాయుడు పేట బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ ఏ. వికాస్ పాల్గొన్నారు.

ఉత్కంఠంగా మారిన బాలుడి కిడ్నాప్ కేసు కథ సుఖాంతం
బాలున్ని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్పీ

విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ అప్పారావు గురైన బాలుడిని ఇట్టికేళ్లకు పోలీసులు పది గంటల్లోపు గుర్తించే తల్లిదండ్రుల అప్పగించడంతో కథ సుఖాంతం అయింది. జిల్ల ఎస్పీ కథనం మేరకు అక్టోబర్ నెల 3వ తేదీ తెల్లవారు జామున సుమారు 2 గంటల ప్రాంతంలో తిరుపతి ఏపీఎస్ఆర్టీసీ బస్టాండు లో చెన్నై బస్ ప్లాట్ ఫామ్ రిజర్వేషన్ టికెట్ కౌంటర్ దగ్గర పురసువాకం, చెన్నై కి చెందిన అరుల్ మురుగన్, 2 సం.లు అనే బాలుడు తన తల్లిదండ్రులు మీనా, చంద్ర శేఖర్, అన్న మోఘన వసంత్ 8సం.లతో పాటుగా నిద్రిస్తుండగా, ఆ బాలుడు కనిపించకుండా పోయినట్లు తల్లిదండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిర్యాదు అందుకొన్న వెంటనే తిరుపతి డిఎస్పి ఎ.సురేంద్ర రెడ్డి, రాత్రి డ్యూటి లో ఉండిన తిరుపతి సీసీస్ డిఎస్పి రవి కుమార్ ఈస్టు సిఐ మహేశ్వర రెడ్డి వారు తమ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి, నలువైపులకు పంపి, గాలింపులు చర్యలు చేపట్టారు. కేసును చేధించి తప్పిపోయిన పిల్లవాన్ని అవిలాల సుధాకర్ అను అతను అపహరించుకొని పోయినట్లు, తెలుసుకొని అతని అదుపులోకి తీసుకొని పిల్లని తల్లిదండ్రులకు అప్పగించారు. సీసీటీవీ ఫూటేజ్ ల ద్వారా తప్పిపోయిన బాలుడిని ముద్దాయి అవిలాల సుధాకర్ అపహరించినాడని గుర్తించి, పోలీసు సోషల్ మీడియా విరివిగా బాలుడి ఫోటో తో ప్రచారం కల్పించి బాలుడు, ముద్దాయిల కోసం తీవ్రంగా గాలిస్తుండగా, విషయం తెలుసుకున్న ముద్దాయి అపహరించిన బాలున్ని, ఏర్పేడు మండలం మాధవమాల గ్రామంలోని తన అక్క నెల్లూరి ధనమ్మ వద్దకు తీసుకొని వెళ్లి బాలున్ని వదిలిపెట్టి పరరైనాడు. ఈ విషయాన్నీ తెలుసుకున్న పోలీసు బృందం ఆమె వద్దకు వెళ్లి బాలున్ని క్షేమంగా స్వాధీనం చేసుకున్నారన్నారు. ముద్దాయి ఆవిలాల సుధాకర్ ను కూడా తదుపరి ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని, సమగ్రమైన విచారణ చేపట్టారు. ముద్దాయి అక్క అయిన ధనమ్మను, కొంత మంది అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. ఈ కేసును అతి వేగంగా ఛేదించి బాలుని ఆచూకీ కనిపెట్టదానికి కృషి చేసిన సిబ్బంధిని జిల్లా ఎస్పి అభినంధించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి పరిపాలన వెంకట్రావు, ఎస్పి డిఎస్పి గిరిధర, తిరుపతి డిఎస్పి సురేంద్ర రెడ్డి, ఈస్ట్ సీఐ మహేశ్వర రెడ్డి, కేసును చేదించిన సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్య విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరం ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.స్వరూప వృత్తి విద్య విద్యార్థులకు మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థిలు కళాశాలలో నిర్వహించే స్టడీ అవర్ కు హాజరుకావాలని తెలిపారు. కళాశాల టైమింగ్స్ ను పాటించలని చదవడం ద్వారా ఉన్నతమైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరు యూనిఫామ్ తప్పనిసరిగా వేసుకోని రావాలని విద్యార్థులకు తెలిపారు. ఉన్నత ఫలితాలు సాధించాలని ప్రతి లెక్చరర్ కు 15 మంది విద్యార్థులను కేటాయించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసాలు కే. రమేష్, డాక్టర్ మాధవ నాయుడు, కిషోర్ కుమార్, సిబ్బంది బంగారయ్య,రమేష్,విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ జగనన్న లక్ష్యం :ఎమ్మెల్యే వెలగపూడి

విశాలాంధ్ర-కోట : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని గూడూరు శాసనసభ్యుడు వెలగపల్లి వరప్రసాద్ రావు పేర్కొన్నారు.కోట మండలం కొత్తపట్నం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో ఐదు దశలుగా సర్వే జరిపి ప్రతి వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య వివరాలతో కూడిన రికార్డు నమోదు చేయడం జరుగుతుందని అంతేకాకుండా ఏడు రకాల పరీక్షలు వైద్యం అందించడంతో పాటు ఉచితంగా 173 రకాల మందులను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.ప్రతి పేదవాడు ఆర్థిక ఇబ్బందులతో సంపాదనలో 60 శాతం మేర విద్య వైద్యానికి ఖర్చు చేయాల్సి వస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు ఈపథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పల ప్రసాద్ గౌడ్ ఎంపీడీవో భవాని,ఎంపీటీసీ మోబీన్ భాష, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభలో అధికారుల దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : వరదయ్యపాలెం సచివాలయము1ఆవరణలో గ్రామ సభ ను సర్పంచ్ జ్యోతి అధ్యక్షతన ఈఓ బసిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.మూడు రోజుల ముందుగా మైక్ అనౌన్స్మెంట్ ద్వారా,వాలంటీర్ ల ద్వారా,ప్రజలకు తెలియజేయడం వలన పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొనడం హర్షించదగ్గ విషయం అని ఈఓ బసిరెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా పంచాయతీకి సంబందించిన 2023-24 లో ఇప్పటి వరకు జమ ఖర్చులను ఈఓ బసిరెడ్డి చదివి వినిపించారు.అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ఎంపిక కాబడిన లబ్ధిదారులు,ప్రజా ప్రయోజనం కొఅకు చేపట్టిన, చేపట్టబోతున్న,పనులపై చర్చించి ఆమోదం తెలిపారు.శాఖా పరమైన అంశాలపై ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా వెలుగు సంఘాలకు సంబందించిన అన్ని గ్రూప్ లకు సున్నా వడ్డీ అందలేదని ఇంచార్జి ఏపీఎం లక్ష్మయ్య ను మహిళల సంఘాలు ప్రతినిధులు ప్రశ్నించగా,వాయిదాల పద్ధతిలో అందుతుందని లక్ష్మయ్య మహిళలకు తెలిపారు సమయం, సందర్భం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఈఓ దృష్టికి తీసుకెళ్లాగా, నదరు సమస్యను సంబంధిత శాఖకు తెలియజేసి, పరిష్కారం కొఅకు కృషి చేస్తామని ఈఓ తెలిపారు.ఇంటి స్థలాలు,ఇంటి పట్టాలు గురించి పలువురు ప్రశ్నించారు.వీధి దీపాలు వెలిగే విధంగా చూడాలి అని వరదయ్యపాలెం హరిజనవాడకు చెందిన మహిళలు ఈఓ దృష్టికి తీసుకొచ్చారు.వెంటనే చేస్తానని హామీ ఇచ్చారు. ఈ గ్రామసభకు సచివాలయ సిబ్బంది,వాలంటీర్ లు,వార్డు మెంబెర్ మునిభూషణమ్మ,దొడ్డి సిద్దలయ్య,కల్లూరు మోహన్,ఓజిలి దశరదయ్య,గ్రామస్తులు, పాల్గొన్నారు.

అభివృద్ధి ఎక్కడ అంటూ ప్రశ్నలు.

స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి రెండేళ్లు దాటింది.వరదయ్యపాలెం టౌన్ కి సంబంధించి తుడా ద్వారా డ్రైనేజీ కి ఫండ్స్ వచ్చాయి కొందరు అన్నారు.కొలతలు కూడా తీసుకున్నారు.గ్రంధాలయం కడుతున్నాము అన్నారు.డ్రైనేజీ నిర్మాణం మాట దేవుడెరుగు,గ్రంధాలయం కడుతూనే ఉన్నారు.మింగ మెతుకు లేదు కానీ మీసాలకి సంపెంగి నూనె అన్న చందాన మండలం పరిస్థితి.ఎంపీడీఓ,రెవిన్యూ, తెలుగుగంగ మొదలగు ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న స్థలల్లో ఇప్పటివరకు సెంటూ భూమి కూడా కబ్జా కాలేదు.కబ్జా అవుతుందేమో అని చెబుతూ దురుద్దేశంతో ప్రజాధానం దూర్వినియోగం చేస్తూ సుమారు 20 నుండి 25 లక్షల రూపాయల వ్యయంతో ఆగ మేఘాలమీద ప్రహరీ గోడ కట్టి బిల్లు కూడా మంజూరుచేసుకున్నారు.ఉపయోగం లేని గోడకి ఖర్చు పెట్టిన డబ్బులతో ఎంతో కొంత డ్రైనేజి సమస్యలను తీర్చి ఉండొచ్చు కదా అని కొందరు అభిప్రాయపడ్డారు.వరదయ్య పాలెం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఇళ్లల్లో సెప్టిక్ ట్యాంక్ లు ఓవర్ ఫ్లో అయ్యి,రోడ్ల మీదకి వదులుతున్నారు.(వాన నీటిని తలపించే డ్రైనేజీ నీరు వాహనాలు వచ్చి పోయేటప్పుడు తుంపర్లు మనుషులు మీద పడటంతో తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు).ఇవన్నీ అడుగుతారని కాబోలు మేజర్ పంచాయతీలో గ్రామ సభకు మండల ఉన్నత అధికారులు హాజరు కాలేదేమో అని పలువురు చర్చించుకున్నారు.

టీడీపీ నిరసనలకు సీపీఐ సంఘీభావం
- ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్రనేత రామానాయుడు

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టీడీపీ నేతలు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు సీపీఐ పార్టీ కూడా సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. ఈ మేరకు తిరుపతిలో టీడీపీ రాష్ట్రనేత గొల్ల నరసింహ యాదవ్, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి పుష్పావతిల ఆధ్వర్యంలో జరిగిన నిరసనలు, ర్యాలీ ప్రదర్శనల్లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, చంద్రబాబు నాయుడుకు సంఘీ భావంగా నినాదాలు చేశారు. జగన్ సర్కారు తీరును నిరసిస్తూ సత్యాగ్రహ దీక్షను కూడా టీడీపీ శ్రేణులు చేపట్టారు. ఇందులో భాగంగా తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు నరసింహా యాదవ్ ఆమరణ నిరాహార దీక్షకు జనసేన, సిపిఐ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. నరసింహా యాదవ్ చేపట్టిన దీక్షకు భారీగా మద్దతు పెరుగు తుండడంతో ఓర్వలేని వైసిపి ప్రభుత్వ పెద్దలు పోలీసులతో ఆమరణ నిరాహార దీక్షను సోమవారం అర్ధరాత్రిలో భగ్నం చేయించారని మండిపడ్డారు. తాము గాంధేయ మార్గంలో దీక్షను చేపడుతున్నా ఓర్వలేని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పోలీసుల సహకారంతో దీక్షలను భగ్నం చేయించడం విడ్డూరంగా ఉందని టిడిపి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం అంటే వైసీపీకి గౌరవం లేదా..?అని ప్రశ్నిం చారు. ఇప్పటికే రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి అడ్డ మార్గంలో చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయించిన ఏపీ సీఎం జగన్‌కు ప్రజాస్వామ్య విలువలంటే లెక్కలేదనే విషయం తేలి పోయిందన్నారు. కుట్ర రాజకీయాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలే కాకుండా దేశమంతా కోడై కూస్తున్నా..జగన్ రెడ్డికి జ్ఞానోదయం కలగక పోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ప్రాథమిక హక్కులను హరించిన ఏకైక వ్యక్తి జగన్ అని ఆరోపించారు. భారత రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛ స్వాతంత్రాన్ని కాలరాస్తున్న సీఎం జగన్కు భవిష్యత్తులో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర -నారాయణవనం:-నారాయణవనం మండల కేంద్రంలోని స్థానిక నారాయణవనం మండలంలో శ్రీ తాతా సొరకాయల స్వామి మండపంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ ఇ. సొరకాయలు. ఎంపీపీ దివాకర్ రెడ్డి. జడ్పిటిసి కోనేటి సుమన్ కుమార్. ఎంపీటీసీలు. వైస్ ఎంపీపీలు. వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి. ఆర్ డి ఏకాంబరం. సర్పంచులు. గృహ సారథులు. వాలంటీర్లు. వార్డ్ మెంబర్లు. ఉప సర్పంచ్లు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ముఖ్య అతిథులుగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి. పాదయాత్ర చేపట్టి ప్రతి పల్లెలో పేదవారి కష్టాన్ని గుర్తించి. ఆయన ఇచ్చిన మేనిఫెస్టోలో ప్రతి పేదవారికి అందేలా చాలా అరుదులైన పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. గడపగడపకు. జగనన్న సురక్ష. నాడు నేడు. బడి ఈడు పిల్లల భవిష్యత్తు. పిల్లల ఎడ్యుకేషన్. పల్లె ఊరి అభివృద్ధి. రైతు భరోసా ఇలా ఎన్నో అరుదైన పథకాలను ప్రవేశపెట్టి ఈ నాలుగేళ్లలో ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనటువంటి విధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ముఖ్యమంత్రిని మనం మళ్లీ సీఎం గా గెలిపించుకొని ఇంకా ప్రజలకు మంచి చేయాలని పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మనమందరం ముఖ్యమంత్రిని గెలిపించుకోవాలంటే మనం ప్రజల్లో వెళ్లి మన ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ప్రతి పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజలకు కావలసిన అన్ని సదుపాయలను చేస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ మనం గెలిపించుకోవాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కోనేటి సుమంత్ కుమార్. ఎంపీపీ దివాకర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం లో చంద్ర ప్రభ వాహనంపై బొజ్జ గణపయ్య

విశాలాంధ్ర - ఐరాల : కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో ఈనెల 28 వతేది గురువారం నుంచి అత్యంత వైభవంగా జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి సిద్దిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారు చంద్ర ప్రభ వాహన ము పై కాణిపాకం గ్రామ పురవీధులు గుండా ఊరేగుతూ భక్తులను అలరించారు. గత నెల 18 వతేది సోమవారం నుంచి అత్యంత వైభవంగా జరిగిన స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా 27 వతేది బుధవారం ధ్వజారోహణము తో ముగిశాయి.తిరిగి 28 వతేది గురువారం నుంచి ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.. ఈసందర్భంగా కాణిపాకం,చినకాంపల్లి, వడ్రాంపల్లి, కొత్తపల్లి, చిగరపల్లి, తిరువణంపల్లి, బొమ్మసముద్రం, అగరంపల్లి, పుణ్యసముద్ర., ఎగువమారేడు పల్లి, దిగువ మారేడుపల్లి, సంతపల్లి, ఉత్తర బ్రాహ్మణ పల్లి, కారకంపల్లి వంటి గ్రామాలకు చెందిన హరిజన వంశ స్థుల ఆలయ ఉత్సవ ఉభయదార్లు గా వ్యవహరించారు. చంద్ర ప్రభ వాహనము పై శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి కాణిపాకం పురవీధులు గుండా మంగళ వాయిద్యాలు, నడుమ ఘనంగా ఊరేగుతూ భక్తులను అలరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ. మోహన్ రెడ్డి,ఆలయ ఈవో వెంకటేశు,ఏఈవోలు విద్యాసాగర్ రెడ్డి,రవీంద్రబాబు, హేమమాలిని,ఎస్వీ క్రిష్ణా రెడ్డి, హరి మాధవరెడ్డి,ఆలయ ప్రధాన అర్చకులు యస్.సోమశేఖర్,ఈఈ వెంకట నారాయణ, ఆలయ సూపర్ డెంట్లు కోదండపాణి, శ్రీధర్ బాబు, రంగస్వామి,టెంపుల్ ఇన్ స్పెక్టర్ లు పి.బాబు, పి.సురేష్ బాబు లతో పాటు ఆలయ సిబ్బంది, ఆలయ ఉభయదార్లు,వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ప్రారంభం

విశాలాంధ్ర-సత్యవేడు:సత్యవేడు మండలం పెద్ద ఈటిపాకం పంచాయితీ రాచపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు మంగళవారం ప్రారంభమయ్యాయి.గ్రామసర్పంచ్ రూబెన్,ఎంపిటిసి సెల్వి రమణ అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో జగనన్న సురక్ష క్యాంపు జరిగింది. రాచపాలెం కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో సర్వే ద్వారా గుర్తించిన వ్యాధిగ్రస్తులు హాజరయ్యారు.ఈ నేపథ్యంలో చిన్నపాండూరు వైద్యులు లావణ్య ఆధ్వర్యంలో తిరుపతి రుయా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ మహాలక్ష్మి,జనరల్ సర్జన్ డాక్టర్ శారద,దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గుణశేఖర్ తదితర వైద్య బృందం రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.క్యాంపుకు పది రోజుల ముందే సంబంధిత ఏఎన్ఎం ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించడం జరిగింది. జగనన్న సురక్ష క్యాంపుకు 524 మంది రోగులు పాల్గొనగా ఇందులో పురుషులు 245, మహిళలు 279 మంది ఉన్నట్టు సంబంధిత పంచాయతీ సెక్రెటరీ జలజ శ్రీ పేర్కొన్నారు.

తెలుగుగంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : ఎస్సై నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు వరదయ్యపాలెం మండలంలోని నాగనందాపురం గ్రామం దగ్గర తెలుగుగంగకాలువలో సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చిన వైనం స్థానికులు గుర్తించిన విషయం తెలిసిందే ఎస్సై నాగార్జునరెడ్డి ఏఎస్సైషన్ముగం ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు.మృతదేహం పూర్తిగా నీటిలో మునగడం వల్ల బాగా కుళ్ళిపోయి గుర్తు పట్టలేని విధంగా తయారయింది.జీన్స్ ప్యాంటు బ్లాక్ అండ్ వైట్ గళ్ళచొక్కాతో ఉన్న చనిపోయిన వ్యక్తి దగ్గర పర్సులోని ఫోన్ నంబర్ల ఆధారంగా రేణిగుంట పరిసర ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. పర్సులో ఓ మహిళ ఫోటో ను కూడా పోలీసులు గుర్తించారు ఇతని చిరునామా తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై నాగార్జునరెడ్డి కోరారు.

అమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు, అలాగే ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించడం, గ్రామాలలోనే సురక్ష క్యాంపులను నిర్వహించి వారికి కావలసిన వైద్య సహాయాన్ని అందించడం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ధ్యేయం. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాలెంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్షలో పలువురికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న 13 మందిని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పిటల్స్ కి రిఫర్ చేశారు. మండల తాసిల్దార్ ద్వారకానాథ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మపాలెం గ్రామ సర్పంచ్ జి.లీలమ్మ, ఎంపీటీసీ టీ.శాంతి, గ్రామ పెద్దలు యుగంధర్ రెడ్డి, మండల వైయస్సార్సీపి యూత్ ప్రెసిడెంట్ సురేంద్ర యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ కె.రఘు కేశవరెడ్డి, మండల వైసిపి పార్టీ ప్రెసిడెంట్ వేయాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక సాగర్ ఆలయ వార్షికోత్సవం
- ప్రత్యేక పూజల్లో బీజేపీ నేత గుండాల గోపినాథ్

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్థానిక వినాయక సాగర్ వద్దనున్న సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి ఆలయం 4వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో బీజేపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, వినాయక చవితి మహోత్సవ కమిటీ సభ్యులు గుడిపల్లి భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొని స్వామి సేవలో తరించారు. పూజల అనంతరం గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. పురోహితుడు సురేష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుని స్వామివారి కృపా కటాక్షాలకు పాత్రులు కాగలరని వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు కోరారు. సంకల్ప వరసిద్ధి వినాయక స్వామి వారి సేవలో ధర్మకర్త కొండే చెంగా రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రవచనకర్త గరికపాటి రమేష్ బాబు, అక్కిపల్లి మునికృష్ణ యాదవ్, కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, పొన్నాల జేజి రెడ్డి, డి.పి.ఆనంద్, టీచర్ తిరుమల, మల్లారపు రవి ప్రసాద్, వేలూరు పాపిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణులను కాపాడడం మన అందరి బాధ్యత

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:-"అటవీశాఖ వన్యప్రాణి వారోత్సవాల "లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లూరు నందు అటవీ శాఖ, చిత్తూరు జిల్లా పశ్చిమ భాగం ఐరాల సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జయశంకర్ విద్యార్థులతో "అడవులను రక్షించడం- వన్య ప్రాణులను కాపాడడం" అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి మంచి ప్రతిభ కనబరిచిన వారికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి పోకల తాతయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీ వాణి తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జయశంకర్ మాట్లాడుతూ జీవవైవిధ్యం లో భాగంగా మానవ మనుగడ తో పాటు వన్యప్రాణులు కూడా చాలా ముఖ్యమని కావున ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ వన్యప్రాణులు రక్షించి, సమస్త జీవకోటికి ప్రాణదాతలు కావాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శ్రీదేవి, లావణ్య, రెడ్డి ప్రసాద్, శంకరప్ప, పద్మావతి , ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు, రాజేంద్ర, వేణుగోపాల్ ,రాజశేఖర్, స్నేహ మాలిని పాల్గొన్నారు.

జగనన్నలే అవుట్ ల ఆకస్మిక తనిఖీలు:ఎండివో

విశాలాంధ్ర - సోమల : సోమల మండలం లోని సోమల లో నిర్మిస్తున్న జగనన్న కాలనీ లో మంగళవారం మండల అభి వృద్ధి అధికారి.నాగరాజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన లబ్దిదారుల తోమాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలని ఆదేశించారు. అలాగేలే అవుట్‌లో ప్రభుత్వం మౌలిక సదుపాయాల ను త్వరితగతిన ఏర్పాట్లు చేస్తున్నారు .ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణం లను పూర్తిస్థాయిలో నిర్మించాలని సూచించారు. వీరి వెంట ఎం.పి.పి..ఈశ్వరయ్య ,హౌసింగ్ శాఖ కు చెందిన నగేష్ ,కార్య దర్శి సుధాకర్ ,ఇంజినీరింగ్ శాఖకు చెందినషారూక్,వాలంటీర్ లు పాల్గొన్నారు.

సబ్ఎడిటర్ కావలెను
విశాలాంధ్ర జాతీయ దినపత్రిక తిరుపతి ఎడిషన్ కార్యాలయంలో పనిచేయుటకు సబ్ఎడిటర్ కావలెను. ఇతర పత్రికల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు
సంప్రదించవలసిన చిరునామా
ఎడిషన్ మేనేజర్
విశాలాంధ్ర దినపత్రిక
9-91/5, దామినేడు, ఇందిరమ్మ గృహాలు ఎదురుగా, తిరుపతి రూరల్.
సెల్: 94909 52129

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

జగనన్న టిడ్కో ఇండ్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని గూడూరు పల్లి సమీపాన నిర్మాణం పూర్తి చేసుకున్న టిడుకో జగనన్న ఇండ్లను మంగళవారం రోజున మున్సిపల్ చైర్మన్ అలిమ్ భాష కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి స్థానిక కౌన్సిలర్ మనోహర్ పరిశీలించడం జరిగిందిఅక్కడ జరుగుతున్న మౌలిక వసతుల పై పర్యవేక్షణ చేయడం జరిగింది ఈ సందర్భంగా చైర్మన్ అలీమ్ భాష మాట్లాడుతూ ఈ నెల ఐదున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో నిర్మితమవుతున్న ఇండ్లన్నీ సామూహిక గృహప్రవేశాలు జరగనున్నడంతో ఆ ప్రాంతానికి వెళ్లి ప్రత్యేకంగా పరివేక్షణ చేయడం జరిగిందన్నారు ప్రజలు గృహప్రవేశాలు చేసేనాటికి అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకి ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు పేదింటి కళా సహకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా రుణపడి ఉండాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు కొండవీటి నరేష్ ఎండి గౌస్ రమణ హౌసింగ్ అధికారులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇచ్చి పులివర్తినాని ఎమ్మెల్యేగా గెలిపించాలన్న పులివర్తి సుధారెడ్డి

విశాలాంధ్ర - ఎర్రావారిపాలెం: తలకోన సిద్దేశ్వర స్వామి దేవాలయంలో చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి చంద్రబాబు జైలు నుండి తొందరగా విడుదల కావాలని సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా తలకోన ఆలయంకు చేరుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు పులివర్తి సుధా రెడ్డికి ఆహ్వానం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు ఏ తప్పు చేయకుండా అక్రమ అరెస్టు చేశారని ఆమె అన్నారు. అనంతరం చింతగుంటపంచాయతీ పసుపులేటివారిపల్లె, ఈడిగపల్లి, చింతగుంట, ఆదిఆంధ్రవాడ,సిద్దుగారిపల్లె ల ను పులివర్తి సుధారెడ్డి ఇంటింటికి తిరిగి ఒక్కఅవకాశం ఇచ్చి పులివర్తినాని ఎమ్మెల్యేగా గెలిపించండి అబివృద్ధి చేసి చూపిస్తాం అని హామీ ఇచ్చారు. ప్రజలు తమసమస్య లను పులివర్తి సుధారెడ్డి కి మోరపెట్టుకున్నారు. యర్రావారిపాలెం మండలం లో నిరుద్యోగ యువత ఎక్కువగా ఉందని తాము అధికారం లోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని సుధారెడ్డి తెలిపారు.డోర్ టూ డోర్ కార్యక్రమంలో యర్రావారిపాలెం మండల తెలుగుదేశం పార్టి నాయకులు కార్యకర్తలు, జెనసేన నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమం, సామాజిక సేవా రంగాల సలహా సూచనల

ప్రత్యేక ఆహ్వానితులుగా జి. అమర్నాథ్

విశాలాంధ్ర - వి. కోట : చిత్తూరు జిల్లా పరిషత్ లో సాంఘిక సంక్షేమ, సామాజిక సేవా రంగాల కు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వి. కోట (మండలం) మేజర్ పంచాయతీ పి. కొత్తూరు గ్రామానికి చెందిన జి. అమర్నాథ్ శ్రీనివాసులు ను నియమించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పి సమావేశ మందిరంలో జరిగిన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం లో జిల్లా పరిషత్ అధ్యక్షులు ప్రవేశపెట్టిన ముసాయిదా ఆమోదం ఉత్తర్వులు ప్రకారం జి. అమర్నాథ్ శ్రీనివాసులు ను సాంఘీక సంక్షేమ, సామాజిక సేవా రంగాలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందించడానికి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాలను రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లు అమర్నాథ్ తెలిపారు. అమర్నాథ్ ప్రస్తుతం వి. కోట జూనియర్ కళాశాల అభివృద్ధి ఛేర్మెన్ గా కొనసాగుతున్నారు.

సమస్యల పరిష్కారమే గ్రామ సభ లక్ష్యం

విశాలాంధ్ర - కార్వేటినగరం: సమస్యల పరిష్కారం కోసమే గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభ లక్ష్యమని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. మంగళవారం సచివాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో సర్పంచ్ మాట్లాడుతూ. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి గ్రామ సభలు ఎంతో దోహద పడుతుందని తెలిపారు. వార్డుల మెంబర్లు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి సమావేశం దృష్టికి తీసుకొచ్చినప్పుడే ఆ సమస్యకు పరిష్కార మార్గం లభిస్తోందని చెప్పారు. అనంతరం సమస్యలపై పలువురు అందించిన వినతులను స్వీకరించి పరిష్కారానికి ఆమోదం తెలిపారు. అలాగే పంచాయతీలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై పంచాయతీ తీర్మానాన్ని ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, ఎంపీటీసీ వెంకటేష్, పంచాయతీ ఈవో పీ.ఎస్ మణి, కార్యదర్శి సెల్వి విజయశ్రీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత విద్యార్థిని ఆదుకొన్న బీసీవై పార్టీపార్టీ అధినేత

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని పాలెం పల్లి గ్రామానికి చెందిన మస్తాన్ భాష కుమార్తె బేబీ హీన పూజ గాని పల్లి హైస్కూల్ నందు పదవ తరగతి చదువుతుండగా తీవ్రమైన జ్వరం వచ్చి మెదడు వ్యాపి వ్యాధి ఏర్పడి కిడ్నీ సమస్యగా మారి తమిళనాడు రాష్ట్రం వేలూరు సిఎంసి వైద్యశాల నందు చికిత్స పొందుతుండడంతో వారి కుటుంబ సభ్యులకు భారం కావడంతో ఈ విషయం తెలుసుకోన్న బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ వైద్య ఖర్చుల నిమిత్తం తన వంతు సాయంగా 20 వేల రూపాయలు ఆర్థిక సాయం తన సభ్యులైన సాంబమూర్తి హరినాథ్ రెడ్డి అనిల్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థిని తల్లిదండ్రులకు ఇవ్వడం జరిగింది విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తున్నామని ఆర్సి వైస్ సభ్యులు పేర్కొన్నారు అదేవిధంగా మండలంలోని ఎంసి కొత్తూరు గ్రామంలో వెలిసి ఉండు రామాలయం ఆలయం ముందర రేకుల సీట్ల నిర్మాణం కొరకు రామచంద్ర యాదవ్ తన వంతు సహాయంగా ఆలయ కమిటీ వారికి తన సభ్యుల ద్వారా 56 వేల రూపాయలు అందించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యం

విశాలాంధ్ర - వి.కోట: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 288 మందికి వైద్య సేవలు అందించారు. వి. కోట ఒకటవ సచివాలయం పరిధిలోని గృహాల్లో ఇటీవల నిర్వహించిన ఇంటింట ఆరోగ్య సమాచార ప్రాతిపదికన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మొత్తం 288 మంది వైద్యం కోసం హాజరుకాగా వారికి 7 రకాల పరీక్షలు నిర్వహించారు.అలాగే వారిలో 169 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు, జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు రాగా వారికి సలహాలు సూచనలు ఇవ్వడం తో పాటు వివిధ రకాల రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం 105 రకాల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.రాజేష్ నాయక్, యుగంధర్ టి విజయకాంత్, సుష్మిత, అనూహ్య తదితరులు పాల్గొన్నారు, మండల తహసీల్దార్ చిట్టిబాబు,మండల అభివృద్ధి అధికారి అహమ్మద్ రఫీక్, పంచాయతీ విస్తరణాధికారి యాదవపతి లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కార్వేటినగరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన్ మురళి, వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ అన్నారు. మంగళవారం అన్నూరు సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఇంట్లోని రోగులు తప్పనిసరిగా జగనన్న సురక్ష క్యాంప్ లో ఉచితంగా ట్రీట్మెంట్ తీసుకోవాలన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ సుందర్ రాజ్, సింగల్ విండో అధ్యక్షులు లోకనాథరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్ గోపీనాథ్, హేమశ్రీ,మురళి, తిరుమలేష్, తహసీల్దార్ రవికుమార్, గ్రామస్తులు,సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష

జడ్పీ సమావేశంలో డిప్యూటీ సి ఎం నారాయణస్వామి

విశాలాంధ్ర -చిత్తూరు: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన వినూత్న కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి కె. నారాయణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం జెడ్పి సమావేశపు మందిరమైన వై. యస్. ఆర్ సభావేదికలో జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన జెడ్పి సాధారణ సర్వ సభ్య సమావేశానికి ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి లు ముఖ్య అతిథులుగా విచ్చేయగా, చిత్తూరు ఎంపీ ఎస్.రెడ్డప్ప, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఎంఎల్‌సి భరత్, చిత్తూరు, తంబళ్ళపల్లి ఎంఎల్ఏలు ఆరణి శ్రీనివాసులు, పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన వినూత్న కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అని ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నాడు- నేడు క్రింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి మాట్లాడుతూలి పేదరికం కొలమానంగా ప్రభుత్వం గత నాలుగు సంవత్సరాలుగా అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నదన్నారు జిల్లా గృహ నిర్మాణ పురోగతిలో ప్రథమ స్థానంలో ఉందని, దీనిని ఇలాగే కొనసాగిస్తామని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి అర్హులైన వారికి మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు జరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు.జెడ్పి ఛైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మానస పుత్రిక జగనన్న సురక్ష కార్యక్రమం సెప్టెంబర్ 30న ప్రారంభమై దిగ్విజయంగా కొనసాగుతున్నదని తెలిపారు. జిల్లా పరిషత్ లో కారుణ్య నియామకాలకు సంబంధించి జిల్లాకు చెందిన మంత్రులు, జిల్లా కలెక్టర్ ద్వారా గ్రామవార్డు సచివాలయాలలో ఉద్యోగ నియామకాలను చేపట్టామని తెలిపారు.మండల పరిధిలో గల త్రాగునీటి కొరతను ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ సహకారంతో పరిష్కరించడం జరిగిందన్నారు. వివిధ అభివృద్ధి పథకాల కొరకు రెండు సంవత్సర కాలంలో దాదాపు రూ.70 కోట్లు మంజూరు చేసి 70 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని మిగిలిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, జడ్పీ వైస్ చైర్మన్లు ధనుంజయ రెడ్డి, రమ్య ,జెడ్పి సిఈఓ ప్రభాకర్ రెడ్డి సంబంధింత శాఖల అధికారులు, ఎంపిపిలు, జడ్పీటీసీలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం లో ఫైర్ స్టేషన్ కల సాకారమయ్యేనా..?

- శిలాఫలకం తో సరిపెట్టుకున్న వైనం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: మండలం కేంద్రం పరిధిలో ఫైర్ స్టేషన్ నిర్మాణం కల సాకారం అయ్యేనా అని మండల ప్రజానీకం ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇందుకోసం రెవెన్యూశాఖ సుమారు ఎకరా స్థలం కూడా కేటాయించింది.ఆ స్థలం లో ఇటీవల డిప్యూటీ సిఎం నారాయణ స్వామి చేతులు మీదుగా జులై 10వతేదీ శిలాఫలకా నికి కూడా రిబ్బన్ కట్ చేశారు. సుమారు రెండు నెలలు దాటుతున్నా పునాది రాయిపడలేదు.ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి త్వరితగతిన పనులు ప్రారంభించి భవన నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు నిర్మాణం కలగానే మిగిలిపోయే అవకాశం ఉందని కొందరు రాజకీయ నాయకులు చెబుతున్నారు. హంగులు ఆర్భాటాల తో శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభం కాకపోవడం పై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శిలాఫలకం సరే అభివృద్ధి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.డిప్యూటీ సిఎం నారాయణ స్వామి చొరవ చూపి ఫైర్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పట్టా భూమిలో సీసీ రోడ్లు, తాగు నీటి బోర్లు

భూమి ఒకరిది దౌర్జన్యం మరోకరిది....పెత్తనం ఒకరిది ఇదే తాతి రెడ్లపల్లి శాసనం

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి మండలంలోని పెద్ద చెల్లారగుంట పంచాయతీ, తాతిరెడ్లపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 179,188/4 లో సిసి రోడ్లు, తాగునీటి బోర్లు వేశారని బాధిత రైతన్న రాజన్న,భాస్కర్, రమేష్ అర్జీ రూపంలో సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్, ఎంపీడీఓకు మంగళవారం పిర్యాదు.చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భూమి ఒకరిది, దౌర్జన్యంఒకరిది పట్టా మరొకరు చేసుకొన్నరన్నారు. పట్టా భూమిలో ఎటువంటి బోర్లు ,బావులు లేవని సంబంధిత బైరెడ్డిపల్లి రెవెన్యూ అధికారులు కను సంధుల్లో రిజిస్ట్రేషన్ జరిగిందని గ్రామ వాసి రమేష్ ఆరోపించారు. తీరా గ్రామంలో చూస్తే అదే భూమిలో గ్రా త్రాగునీటి బోర్లు ఉన్నాయి.అనాదిగా వస్తూ, రికార్డులో ఉన్న దారులను వదిలేసి, పట్టా భూమిలో సిసి రోడ్డు వేశారు.మా భూమిలో మీరు ఎందుకు దౌర్జన్యంగా సిసి రోడ్డు వేశారని సంబంధిత అధికారులను బాధితులు నిలదీస్తే కుంటి సాకులతో కాలయాపనం చేస్తున్నారన్నారు. సర్వే నెంబర్ 179 గల భూమిలో గ్రామంలో నుండి అనాదిగా కాలినడక దారి, స్మశానం కు ఇదే దారి గుండా పోయేవారు .కానీ కక్ష ధోరణితో దారికి అడ్డంగా సిమెంట్ రాళ్లతో గోడ నిర్మించడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు నెలకొన్న సమస్యపై బాధి తుడు కాళ్ళు అరిగేలా కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఫలితం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల వద్దకు దారులు లేక పెత్తం దారులకు ఒక న్యాయం,పేదలకు ఒక న్యాయంగా బైరెడ్డిపల్లి మండల సంబంధిత అధికారులు న్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, దాడులను తిప్పికొడదాం:సిపిఐ

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్రంలో అప్రజాస్వామిక, అరాచక పాలనకు పరాకాష్టే ప్రతి పక్ష నేతపైన అక్రమ కేసులు, అరెస్టులని సిపిఐ నేతలు దుయ్యబట్టారు.. మంగళవారం చిత్తూరు సిపిఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ 25 రోజు చేపట్టిన నిరాహార దీక్షలో జిల్లా కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మేము సైతం బాబు అండ అంటూ, సాయంత్రం వరకు నిరసన దీక్షలో కొనసాగించారు. ఈ సందర్భంగా దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు, జనార్ధన్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేయడం, ప్రజా ఉద్యమాలను చేయడం పరిపాటిగా మారిందని ధ్వజంమెత్తారు. ము ప్రజా ఉద్యమాలకు పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ నిరసన దీక్ష శిబిరాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ టిడిపి నాయకులు బి రాజసింహులు చిత్తూరు నగర మాజీ మేయర్ కటారి హేమలతలు మాట్లాడుతూ 25 రోజున శిబిరంలో పాల్గొని మద్దతు ఇచ్చిన సిపిఐ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వామపక్షాల అండతో అధికార పార్టీ ఆగడాలను అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కోదండన్ సుబ్రమణ్యం, గోపీనాథ్, మార్ కొండయ్య, దాసరి చంద్ర,విజయ్ గౌరీ, రమాదేవి , మనీ రైతు సంఘం సెక్రెటరీ మునిరత్నం నాయుడు, జమీలవి, రామ్మూర్తి, మంజునాథ్ బాబు, కుమారి, లత, ప్రియా, చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి: మహాత్మగాంధీ జయంతి సందర్భంగా బైరెడ్డిపల్లి మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో పి ఇ ఎస్ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు బైరెడ్డిపల్లి హైస్కూల్ ప్రాగణంలో మంగళవారం జరిగాయి.సుమారు 100 పాల్గొని చికిత్సలు అందుకొన్నారు. వీరిలో ఆపరేషన్ కొరకు 10 మంది ఎంపిక కావడం జరిగింది. విచ్చేసిన వృద్ధులకు ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాసులు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆపరేషన్ నిమిత్తం వరకు మహతి ఫౌండేషన్ భరోసా గా నిలుస్తుందని చెప్పుకోచ్చారు.విచ్చేసిన మండల ప్రజల వృద్ధులకు నాగరాజు,చీలంపల్లి శేషే గౌడు ఆరోగ్యంపై జాగ్రతలు తమ వంతుగా సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు.

జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో వైద్య సేవలు

విశాలాంధ్ర - రామకుప్పం : మండల పరిధిలోని విజలాపురం పంచాయతీ ఆనిగానూరు గ్రామంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం లో భాగంగా సుమారు 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని అదేవిధంగా అనుభవలైన వైద్యుల చే జగనన్న కంటి వెలుగు లో భాగంగా సుమారు 95 మంది రోగులు కంటి పరీక్షలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కో ఆప్షన్ సభ్యులు బర్కతుల్లా, సర్పంచ్ నేత్రావతి నాగిరెడ్డి, మండల అభివృద్ధి అధికారి రాధాకృష్ణ, తహసీల్దార్ మురళి, వైద్యాధికారిణులు సాదియా, దీపా, పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు, మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు సువర్ణ అవకాశం

విశాలాంధ్ర - పాకాల : గతంలో ఇంటర్మీడియట్ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖా ధికారి విశ్వనాథ నాయక్ తెలిపారు. మంగళ వారం స్థానిక పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హనుమంత్ నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మార్చి , మే నెలలో జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షల లో ఫెయిల్ అయిన విద్యార్థులతోపాటు గతంలో పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులు సైతం ఫీజులు చెల్లించి తరగతులకు సైతం హాజరు కావచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించు కోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బేబీశ్వర్ రెడ్డి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పై సమీక్ష సమావేశం



విశాలాంధ్ర - సోమల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండలం లో 4 .9.23 వతేది నుండి ప్రారంభించడానికి మండలం లోని వైద్యాధికారులు కు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం కు హాజరైన వైద్యుల కు ,సిబ్బందికి మండల అభివృద్ధి అధికారి నాగరాజు తగిన సూచనలు చేసారు. ఈక్రమంలో ఆయన మాట్లాడుతూ మొదటగా 81 చిన్న ఉప్పర పల్లి లో ఉదయం 9 గం. లకు జగ నన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమంలో పై అధికారులు ఆదేశాల మేరకు వైద్యుల కు విధులు కేటాయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమనికి తహశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి,ఎండిఓ నాగరాజులు పర్యవేక్షణలో జరుగు తుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు అడవులను సంరక్షించాలి

విశాలాంధ్ర -పులిచెర్ల- కల్లూరు:- పర్యావరణ పరిరక్షణకు అడవులను సంరక్షించాలనిఅటవీశాఖ డిప్యూటీ రేంజర్ అధికారి జయశంకర్ అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం"అటవీశాఖ వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా "అడవులను రక్షించడం- వన్య ప్రాణులను కాపాడడం" అనే అంశంపై అవగాహన అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పోకల తాతయ్య మాట్లాడుతూ జీవవైవిధ్యం లో భాగంగా మానవ మనుగడ తో పాటు వన్యప్రాణులు కూడా చాలా ముఖ్యమనికావున ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ వన్యప్రాణులు రక్షించి, సమస్త జీవకోటికి ప్రాణదాతలు కావాలన్నారు.

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌ను

పరామర్శించిన మాజీ మంత్రి

విశాలాంధ్ర -పలమనేరు : పలమనేరు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చాంద్ భాషను మాజీ మంత్రి అమరనాథ రెడ్డి మంగళవారం పరామర్శించారు. చాంద్ భాష తల్లి కమురున్నిస్సా వృద్ధాప్య సమస్యతో మృతి చెందారు. దీంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలతో కలసి మాజీ మంత్రి చాంద్ భాష కుటుంబకులను కలసి పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు ఖాజాపీర్, నాగరాజు, మాబాషా, అమానుల్లా, హనీఫ్, అశ్రఫ్, చిన్ని,సురేంద్ర తదితరులు ఉన్నారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో కృత్తిక వేడుకలు

విశాలాంధ్ర - కార్వేటినగరం: స్కంధ పుష్కరిణీ సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయంలో కృత్తిక వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి వారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు. కమిటీ సభ్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

ఏ కొత్తకోటలో ప్రారంభమైన జగనన్న సురక్ష

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని ఏ కొత్తకోట గ్రామంలో జడ్పీ హైస్కూల్ గ్రౌండ్ నందు ఎంపీపీ గాజుల రామ్మూర్తి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వైద్యం కోసం మహిళలు వృద్ధులు చిన్న పిల్లలు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు 350 మందికి ప్రథమ చికిత్సలు నిర్వహించారు 180 మందికి పైగా కంటి పరీక్షలు వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీటీసీలు సర్పంచులు వైద్య సిబ్బంది 104108 సిబ్బంది ఏ నేమ్స్ ఆశా వర్కర్లు అంగన్వాడీ సిబ్బంది సచివాలయ సిబ్బంది వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

సదుంలో కుక్కల బెడద

విశాలాంధ్ర -సదుం : సదుం వీధులలో కుక్కల బెడద కుక్క కావడం జరిగింది కుక్కలు గుంపులు గుంపులుగా వీధులలో తిరుగుతుంటే ప్రజలు భయాందోళను చెందుతున్నారు. చిన్నపిల్లలు పెద్దవాళ్లు ఒంటరిగా నడవాలంటే భయపడుతున్నారు. పంచాయితీ సిబ్బంది వీటి మీద స్పందించి వాటి బెడదను నుండి తప్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఏనుగుల సంచారం భయం నీడలో గ్రామస్తులు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:- పులిచెర్ల మండలం కల్లూరు, కొంగర వారి పల్లి, తుడుంము వారి పల్లె పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఎంత ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులు భయపడిపోతున్నారు. ఈ ప్రాంతాలలో మంగళవారం ఉదయమే జంట ఏనుగులు పొలాల వద్ద కనబడడంతో ప్రజలు అప్రతమై టపాసులు తెలుస్తూ వాటిని తరిమి వేస్తున్నారు. అడవి శాఖ అధికారులు ప్రజల సహకారంతో ఏనుగులను అడవులలోకి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు అయితే జంట ఏనుగులు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి పోతు ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి.గ్రామాలకు ఏనుగులు రాకుండా గ్రామస్తులు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచండి

విశాలాంధ్ర- పాకాల : మండలంలో ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం పాకాల మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మహేశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో ఉపాధి హామీ పనుల టి రిజిస్టర్ లను పరిశీలించారు. ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ సమావేశానికి హాజరుకాని క్షేత్ర సహాయకులకు మెమోలు ఇవ్వాలని ఏపీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కళ్యాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ ప్రచార రథంకు పూజలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు:- పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మంగళవారం విచ్చేసిన కాణిపాకం ఆలయ ప్రచార రథంకుఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు ప్రత్యేక పూజలు చేశారుపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి ప్రచార రథంకు భక్తులు పూజలు చేశారు. స్వామి బాబా గురుకుల్ కాణిపాకం ఆలయ ప్రాధాన్యం విశిష్ట గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు మునీశ్వర భక్తులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర -పాకాల : మండలంలోని కే వడ్డేపల్లి గ్రామపంచాయతీ రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. పంచాయతీ లో సాగు చేస్తున్న పట్టు పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి పుష్పావతి, ఏఈఓరమేష్ నాయక్‌వీఏఏ కౌశిక్, రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
తిరుపతి జిల్లా

బసవయ్యపాళెం చెరువులో ఆక్రమణలు తొలగించండి
-వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండల పరిధిలోని బసవయ్యపాళెం చెరువులో ఆక్రమణలు తొలగించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు వారు మంగళవారం తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బసవయ్యపాళెం చెరువులో సుమారు 16.60 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారన్నారు. ఈ విషయం తెలిసినా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వమంటే మాత్రం అధికారుల సవాలక్ష సాకులు చెబుతారన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల మేరకు పేదలకు భూమిని పంచాలని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసి రాజన్, ఏరియా నాయకులు రుద్రపాక శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి మించల శివకుమార్, మండల నాయకులు మాసారపు నరసింహారావు, బత్తెయ్య, కృష్ణయ్య, లతమ్మ, రాజయ్య, మోహనయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ డాక్టర్ల విభాగం ప్రధాన కార్యదర్శిగా ముప్పాల శంకరయ్య

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా డాక్టర్ల విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన ముప్పాల శంకరయ్యను నియమించారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం నియామక పత్రం అందజేశారు. తనకు ఆ పదవి ఇచ్చినందుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి శంకరయ్య కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి చొరవతో తనకు ఈ అవకాశం లభించటం ఆనందంగా ఉందన్నారు. రాబోయే కాలంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్య సేవలు తన వంతు అందిస్తానని ఈ సందర్భంగా శంకరయ్య తెలిపారు. శంకరయ్యకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యానగర్ ఆటో కార్మిక సంఘం ఏర్పాటు

విశాలాంధ్ర-కోట : కోట మండలం విద్యానగర్ లో మంగళవారం ఏఐటీయూసీ అనుబంధంగా ఆటో కార్మిక సంఘం ఏర్పాటు చేశారు.చల్లా భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈకార్మిక సంఘం ఏర్పాటుకు ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఐక్యతకు వారి సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం ఏఐటియుసి పోరాటం చేస్తుందన్నారు.అనంతరం 40 మంది ఆటో కార్మికుల సమక్షంలో యూనియన్ ను ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా మధుసూదన్ ఉపాధ్యక్షులుగా ఎం ముని, కార్యదర్శిగా సిహెచ్ శ్రీనాథ్,సహాయ కార్యదర్శిగా సిహెచ్ ప్రభాస్,కోశాధికారిగా డి.గిరి,జి.అశోక్,పి.రాజు,జి. సుబ్బారావు, పి.అనిల్,ఆర్.సురేష్,డి.శేషయ్య లను సభ్యులుగా ఎన్నుకున్నారు.అలాగే ఆటో కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పై పలుతీర్మానాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు కే నారాయణ ఏఐటియుసి ఇన్చార్జి సివిఆర్ కుమార్ సిపిఐ సీనియర్ నాయకులు కన్నా సుబ్రహ్మణ్యం,ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే నిరాహారదీక్షకు నెమళ్ళూరు బుజ్జి సంఘీభావం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : బొజ్జల రిషితమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో జరిగిన సత్యమేవ జయతే నిరాహారదీక్షకు సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి సంఘీభావం తెలిపారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు సంఘీభావంగా ఈ నెల 2వ తేది సోమవారం నాడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సబ్‌జైల్‌లో అక్రమ అరెస్టుకు నిరసనగా జైల్‌లోనే నిరాహారదీక్ష చేసారు. దీనికి సంఘీభావంగా నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి రాజమండ్రిలో నిరాహారదీక్ష చేసారు. బొజ్జల రిషితమ్మ, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో జరిగిన సత్యమేవజయతే నిరాహారదీక్ష జరిగింది. దీనికి సంఘీభావంగా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి, 13వ యూనిట్ ఇన్‌ఛార్జి, 22 వ వార్డు ఇంచార్జి నెమళ్ళూరు బుజ్జి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ నుండి సుమారు 50 మంది మహిళా కార్యకర్తలు బొజ్జల రిషితమ్మకి సంఘీభావంగా నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు భారీ ఎత్తున నిరాహారదీక్షలో పట్టణ ప్రజలు, కుల సంఘాలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో శాసనసభ స్పీకరు తమ్మినేని

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఏపీ శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి వీరికి దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, వైసీపీ నాయకులు ముత్యాల పార్థసారధి, బియ్యపు ఆకర్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి ప్రజా ప్రగతి ట్రస్ట్ చేయూత

విశాలాంధ్ర - వరదయ్యపాలెం : తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలంలోని చెన్నవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని బలోపేతం చేయడంలో భాగంగా మండల విద్యాశాఖాధికారి సరస్వతి చేతులమీదుగా ప్రజాప్రగతి ట్రస్టు గ్రంధాలయ పుస్తకాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సరస్వతి మాట్లాడుతూ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని, దాని కొరకు పాఠశాల సమయసారిణిలోని గ్రంథాలయ పుస్తకపఠన పీరియడ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లలందరికీ వారి స్థాయిల ఆధారంగా ఆరు స్థాయిలలో తెలుగు మరియు ఇంగ్లీషు మాధ్యమాలలో పుస్తకాలు అందించడం జరిగిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశికుమార్ పాఠశాలకు మాట్లాడుతూ గ్రంథాలయ పుస్తక పఠనం పిల్లల్లో పఠనాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేస్తూ, పాఠశాలకు చేయూతనందించిన ప్రజాప్రతిష్ట వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పుష్పజ్యోతి, ప్రజా ట్రస్టు క్లస్టర్ కోఆర్డినేటర్లు మరియు వాలంటీర్ అనూష పాల్గొన్నారు.

ఘనంగా అంజూరు శ్రీనివాసులు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వందలాది అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు. అంజూరు శ్రీనివాసులు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపు కోవాలని వారు కోరుకున్నారు. కాగా అంజూరు జన్మదినం పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలోబాలింతల సౌకర్యార్థం నాలుగు వాటర్ కూలర్స్ ను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా అంజూరు శ్రీనివాసులు అధికారులకు అందజేశారు. ఆటో కార్మికులకు యూనిఫామ్ ను అందించారు. అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. మొదట వైఎస్ఆర్ విగ్రహం వద్ద భారీ కేకును ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో అంజూరు శ్రీనివాసులు కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐదు వీల్స్ చైర్ లను దేవస్థానానికి వితరణగా చైర్మన్ అందజేశారు. స్వయంభు స్వామి అన్నదానానికి 50 బియ్యం బస్తాలు విరాళం గా ఇచ్చారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ను విరివిరిగా నిర్వహించారు. అంజూరు శ్రీనివాసులును ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత నరసింహులు, రమాప్రభ, లక్ష్మి, ఎంపీ శ్రీదేవి తదితర సభ్యులు ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేకును వారి సమక్షంలో కట్ చేసి నేతలకు పంపిణీ చేశారు. ఇక బలిజ కులస్తుల్లో సామాజిక సేవలో ఉన్న 11 మందిని ఎంపిక చేసి వారిని ఘనంగా సత్కరించారు. వారికి శ్రీకృష్ణదేవరాయల కంచు విగ్రహాలను అంజూరు శ్రీనివాసులు బహుకరించారు. పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా అంజూరు తారక శ్రీనివాసులు జన్మదినాన్ని పురస్కరించుకుని వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు.

ఇంటింటి ఓటర్ల జాబితా, ఫిర్యాదుల పరిశీలనలు పూర్తి చేసాం:కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం 2024 మేరకు ఇంటింటి ఓటర్ల జాబితా, రాజకీయ పార్టీల నుండి అందిన పిర్యాదులు పూర్తిస్థాయిలో పరిశీలనలు చేపట్టి మార్పులు, చేర్పులకు రికార్డులు సిద్ధంగా ఉంచామని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో సమాచారం అందించడం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి వివరించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమం 2024 పై రాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు అభ్యంతరాలు, అనోమలిస్, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, నగరపాలక కమిషనర్ హరిత , ఇ ఆర్ ఓ లు, ఎఇ ఆర్ ఓ లు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వివరిస్తూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం -2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి 52,327 ఫిర్యాదులు అందాయని , 6వ తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు 1,10,451 ఓటర్ల ను పునఃపరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో డూప్లికేట్ ఓటర్లు 1858, సిఫ్టేడ్ ఓటర్లు 4854, డెడ్ ఓటర్లు 12,709, అందుబాటులో లేనివి 5528 గుర్తించి ఇ ఆర్ ఓ నెట్ నందు అప్ డేట్ చేసామని, ఎన్నికల కమిషన్ అనుమతి రాగానే ముసాయిదా ఓటర్ల జాబితా లో అప్ డేట్ కానున్నదని వివరించారు. అలాగే ఫారం - 6, 7, 8 లకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా పరిశీలనను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లాకు బ్యాలెట్ యూనిట్లు 6870, కంట్రోల్ యూనిట్లు 4270, వివిపాట్స్ 6450 రావడం జరిగిందని తెలిపారు. వీటికి సంబంధించి యాక్సెప్టెన్స్ టెస్ట్ ప్రొసీజర్స్ (ఏటిపి) ఆఫ్ ఈవీఎంలో భాగంగా బెల్ కంపెనీ నుంచి ఇంజనీర్లు వచ్చిన వెంటనే స్కానింగ్ ప్రక్రియను పూర్తి చేయడం జరుగుతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు ఎప్పటికప్పుడు అన్ని వివరాలను తెలియజేయడం జరుగుతున్నదని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు రామారావు, చంద్రముని, తహసిల్దార్లు వెంకటరమణ, శిరీష, ఎన్నికల సూపరిన్ టేన్ డెంట్ సురేష్, ఇడిటిలు జీవన్, శైలజ, శిరీష పాల్గొన్నారు

సురక్షతో రోగులు గుర్తింపు:ఎంపిడివో

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ :జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు తో రోగులకు సరైన వైద్యం అందించడానికి సురక్ష వైద్య పరీక్షలు ఎంపీడీవో డి నరసింహారావు తెలిపారు మండలంలోని గాజుల పెళ్ళూరు సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో నరసింహారావు, రెండోవ మండల విద్యాశాఖ అధికారి ఆవుల ముని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో మరింత మెరుగైన వంతించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బడుగు బలహీన పేదల కోసం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఆరోగ్య సిబ్బంది. ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర రక్ష: ఎంపీపీ

విశాలాంధ్ర -పెళ్లకూరు : మండలంలోని శిరసనం బెడు సచివాలయ పరిధిలో జడ్పీ హైస్కూల్ నందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ నేపథ్యంలో శిరసానంబేడు వైద్యులు డాక్టర్.చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రూప సాయి, వార్షిక, ఫ్యామిలీ ఫిజిక్స్ .చంద్రమోహన్, ఉమా, డాక్టర్ రాజశేఖర్ తదితర వైద్య బృందం రోగులను పరిరక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుకు 572 ఓపిలు వచ్చాయని వైద్య సిబ్బంది తెలియజేశారు. ఎంపీపీ పోలం రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర రక్షా అని తెలియజేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా గ్రామ స్థాయిలో ఆరోగ్య డాక్టర్లను వైద్య సిబ్బంది ద్వారా వైద్యం అందించడం జగనన్నకే సాధ్యమని ఎంపీపీ పోలం రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే సురేష్ బాబు, ఎమ్మార్వో ఎస్ రామయ్య, ఎంపీటీసీ కల్లూరు కృష్ణయ్య, వైద్య సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది గ్రామ నాయకులు పాల్గొనడం జరిగింది.

చంద్రబాబుపై అక్రమ కేసుల నుంచి విముక్తి కలగాలని రెడ్డివారి గురువారెడ్డి పూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడిపై పెట్టిన అక్రమ కేసుల తొలగిపోవాలని, చంద్రబాబుకు అనుకూల తీర్పు రావాలని కోరుతూ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి రెడ్డివారి గురవారెడ్డి మొక్కుకున్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి దర్శించుకుని టెంకాయలు కొట్టారు. రెడ్డివారి గురవారెడ్డి మండల పార్టీ కార్యదర్శి జె తులసి కుమార్, యువ నాయకులు కిరణ్, వాసు, చెంచయయాదవ్, కోటేశ్వరరావు, పలువురు యువకులతో కలిసి కొడి స్తంభం వద్ద గోవింద నామస్మరణ చేస్తూ 101 కొబ్బరికాయలు కొట్టి చంద్రబాబు నాయుడుకి సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని, అలాగే చంద్రబాబు నాయుడు అక్రమ కేసులు నుంచి విముక్తి కలగాలని కోర్టులో న్యాయం గెలవాలని సత్యం జయించాలని, ధర్మం నిలబడాలని ప్రార్థించారు. అంనతరం బేడి ఆంజనేయస్వామి ఆలయం, అలిపిరి వద్ద ఉన్న వినాయక స్వామి గుడిలో చంద్రబాబు నాయుడు పేరు పై ప్రత్యేక పూజల్ని నిర్వహించారు.

ఉమెన్ ఇన్ కెమిస్ట్రీగా ప్రొ. అమినేని ఉమామహేశ్వరి

విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ యూనివర్సిటీ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమినేని ఉమామహేశ్వరి భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, న్యూఢిల్లీ మరియు రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ద్వారా ఏర్పాటు చేసిన జ్యూరీ కెమిస్ట్రీ విభాగంలో అగ్రశ్రేణి 75 మంది భారతీయ మహిళల్లో ఒకరిగా ప్రొ. అమినేని ఉమామహేశ్వరిని ఎంపిక చేసి ఆమె విజయాలను షీ ఈజ్ సిరీస్ షీ ఈజ్ 75 ఉమెన్ ఇన్ కెమిస్ట్రీ యొక్క నాల్గవ ఎడిషన్లో చేర్చనున్నారు. భారతదేశ 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని స్టీమ్ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ - మ్యాథమెటిక్స్ రంగాలు లో మహిళా నాయకత్వం, సుస్థిర అభివృద్ధిని జరుపుకునేలా 75 మంది మహిళల విజయపథ ప్రయాణ ఘట్టాలను ఈ పుస్తకం వివరిస్తుంది. ధైర్యం, ఆశ, సంకల్పం వంటి వాటి గురించిన వ్యక్తిగత కథలను వివరిస్తుంది. ఈ పుస్తకం, అంత సులభం కాని మహిళల వ్యక్తిగత, వృత్తిపరమైన పోరాటాల గురించి బిమాట్లాడుతుంది, అయితే ఈ విభాగాలలో ఏదో ఒకదానిలో పని చేయాలనుకునే ప్రతి అమ్మాయికి ఖచ్చితంగా స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు, బ్రిటిష్ హైకమిషన్ ఆఫ్ ఇండియా మద్దతుతో కూడిన ఈ పుస్తకం లిఖిత పూర్వకముగా విడుదల చేయబడుతుంది. ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా.ఆర్.వి.కుమార్ , బయోఇన్ ఫర్ మాటిక్స్ ప్రొ. అమినేని ఉమమహేశ్వరిని అభినందించారు.

నష్ట పరిహారంకోసం రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర -పెళ్లకూరు:- మండలంలోని అక్క గారి పేట గ్రామానికి చెందిన కొంతమంది రైతులు సిఐటియు ముకుంద ఆధ్వర్యంలో ఎన్ హెచ్ 71 జాతీయ రహదారికి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందలేదని నష్టపరిహారం అందే వరకు రిలే నిరాహార దీక్ష చేస్తామని ఫ్లెక్సీ తో ఎమ్మార్వో ఆఫీస్ ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సిఐటియు ముకుంద మాట్లాడుచూ సర్వే నంబర్ 497 నందు10 ఎకరాల 50 సెంట్ల భూమిని 20 మందికి ప్రభుత్వం కేటాయించిందని అందులో ఏడు మంది భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందలేదని ఈ విషయమై హైవే పనులు మొదలైనప్పుడు నుండి నష్టపరిహారం కోసం తిరుగుచున్నామని అయినా న్యాయం జరగలేదని న్యాయం జరిగే వరకూ న్యాయపోరాటం చేస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో గోపి ,వెంకటేశ్వర్లు ,సుందరయ్య, సులోచనమ్మ మొదలైన వారు పాల్గొన్నారు.

సత్యమేవ జయతే నిరాహారదీక్షకు సంఘీభావం

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు కు సంఘీభావంగా సోమవారం నాడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సబ్ జైల్ లో అక్రమ అరెస్టుకు నిరసనగా జైల్ లోనే నిరాహారదీక్ష చేసారు.దీనికి సంఘీభావంగా నారా భువనేశ్వరి మరియు నారా బ్రాహ్మణి రాజమండ్రిలో నిరాహారదీక్ష చేసారు.బొజ్జల రిషితమ్మ మరియు బొజ్జల సుధీర్ అన్న ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో జరిగిన సత్యమేవజయతే నిరాహారదీక్ష జరిగింది.దీనికి సంఘీభావంగా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి మరియు13 వ యూనిట్ ఇంచార్జి మరియు 22 వ వార్డు ఇంచార్జి నెమళ్ళూరు బుజ్జి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ నుండి సుమారు 50 మంది మహిళా కార్యకర్తలు బొజ్జల రిషితమ్మ కి సంఘీభావంగా నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు భారీ ఎత్తున నిరాహారదీక్షలో పట్టణ ప్రజలు,మరియు కుల సంఘాలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో దూసుకెళ్తున్న పంచాయతీ:సర్పంచ్

విశాలాంధ్ర - చంద్రగిరి: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చొరవ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో చంద్రగిరి పంచాయతీ అభివృద్ధి పనుల్లో ముందుకు దూసుకు వెళుతున్నదని సర్పంచ్ రూప రామ్మూర్తి పేర్కొన్నారు. చంద్రగిరి పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సర్పంచ్ రూప రామ్మూర్తి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో చంద్రగిరికి నిధుల కొరత లేదని పారిశుద్ధ్యం మొదలు నీటి సమస్య అభివృద్ధి పనులు శీఘ్రంగా జరుగుతున్నట్లు ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య అభివృద్ధి పనులను వివరిస్తూ చంద్రగిరిలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా 1.47 లక్షల రూపాయలతో ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, బోర్లు, పైపులైన్లు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 7.0 కోట్ల రూపాయల తుడా నిధులతో సమావేశ మందిరాలు సిమెంటు రోడ్లు మురికి కాలువలు జల శుద్ధి మెషీన్లు రచ్చబండ బెంచీలు ఏర్పాటు పనులు జరుగుతున్నాయని అందులో చాలా శాతం చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. అలాగే 15 లక్షల రూపాయల గ్రామపంచాయతీ నిధులతో మురికి కాలువలు సిమెంట్ రోడ్లు టవర్ ఫోల్స్ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలోని అన్ని శాఖలకు సంబంధించిన ముఖ్యులతో ఆయా శాఖ అభివృద్ధి పనులను చదివి వినిపించారు. తమ పరిధిలో ఏదేని సమస్యలు ఉన్నా అభివృద్ధి పనులు కావాలన్నా ఓ అర్జి ద్వారా విన్నవిస్తే సకాలంలో ఆ సమస్యను శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చొరవతో నెరవేరుస్తామని రూప రామ్మూర్తి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, వాలంటీర్లు, ఆరోగ్య, సచివాలయ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సి రామాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలంలోని చుట్టుగుంట రామాపురం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది ఉదయం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని వైద్య సేవలు ఉపయోగించుకున్నారు అలాగే వైద్య శిబిరాలకు వచ్చిన ప్రజలకు వైద్య సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి ఆరోగ్య సమస్యల్ని గుర్తించి, ఆరోగ్యం పై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యం పై అవగాహన కల్పించి వైద్య సేవలు అందించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ కె సుబ్రహ్మణ్యం రెడ్డి తనయుడు వైఎస్ఆర్ సిపి యువనేత పవన్ కుమార్ రెడ్డి హాజరయ్యారు తమ గ్రామానికి చెందిన ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసులు, మండల విద్యాధికారి మార్కండేయ నాయుడు,సెక్రటరీ పద్మారాణి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రేవతి, డాక్టర్ సాయి హరిణి, డాక్టర్ సత్యప్రియ, డాక్టర్ యాసిన్ సాహేబ్, డాక్టర్ గీతారాణి, డాక్టర్ వికాస్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటతడి పెట్టిన మంత్రి రోజా
మహిళలు నచ్చినట్లు బతకమని సుప్రీంకోర్టే చెప్పింది

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ :తెలుగుదేశం పార్టీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలను తలచుకుని మంత్రి ఆర్కే రోజా కంటతడి పెట్టారు.ఆయన ఎంతో నీచంగా మాట్లాడారన్నారు.మీ ఇంట్లో మహిళల గురించి ఇలాగే మాట్లాడితే ఊరుకుంటారా అని రోజా ప్రశ్నించారు.ఈ విషయాన్ని బండారు సత్యనారాయమూర్తి భార్య, కూతురిని అడుతున్నానని తెలిపారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని సిపిఆర్ విల్లాస్ మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడారు.మీ పార్టీలో ఉన్నప్పుడు తాను మంచిదాన్నని, వేరే పార్టీలో ఉన్నప్పుడు మాత్రం చెడ్డదానిని ఎలా అవుతానని ఆమె ప్రశ్నించారు. వైసీపీ లో ఉండే మహిళలకు కుటుంబాలు లేవా అని నిలదీశారు.ఆయన చేసిన వ్యాఖ్యలు తనను ఎంతో బాధించాయని అన్నారు. ప్రశ్నిస్తే తన క్యారెక్టర్ పై దాడి చేస్తారా అని అన్నారు. టీడీపీ తెలుగు దుశ్శాసన పార్టీగా మారిపోయిందన్నారు. తనపై బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను టీడీపీ నేతలు సమర్థించడం సరికాదని మంత్రి రోజా అన్నారు.లోకేశ్ తో పాటు ఇతర టీడీపీ నేతలు సత్య నారాయణ అరెస్టును ఖండించారు.వారి తల్లులు, భార్యలు, కూతుళ్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైతే ఇలాగే చేస్తారా' అంటూ రోజా కన్నీళ్లు పెట్టుకున్నారు.మహిళపై అభ్యంతరకర ఆరోపణలు చేస్తే బండారు కుటుంబం, టీడీపీ ఖండించకుండా ఆయనకు మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. మహిళలు నచ్చినట్లు బతకమని సుప్రీంకోర్టే చెప్పింది. మీరెవరు నా క్యారెక్టర్ ను జడ్జ్ చేయడానికి. మహిళల్ని టిడిపి ఆట వస్తువుల్లా చూస్తోంది' అని రోజా భావోద్వేగానికి గురయ్యారు.

మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని ఎంఎం వాడలో మురగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని ఆ వాడ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం కమిషనరు రమేష్ బాబును కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎంవాడలో సుమారు 20ఏళ్ళుగా మురగునీటి సమస్య ఉందన్నారు. ఎంఎంవాడలోని ఆరుమాను మాతమ్మ ఆలయం వద్ద కూడా మురుగు నీటి సమస్య అధికంగా ఉందన్నారు. అధికారులు ఇకనైనా స్పందించి కాలువలు ఏర్పాటు చేసి మురగునీటి సమస్య లేకుండా చేయాలని వారు కోరారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గాదిపాకుల యతీష్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు కోసం మోకాళ్లపై వెళ్లి మొక్కులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి త్వరగా విడుదల కావాలని తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని మంగళవారం మాజీ కౌన్సిలరు బీమాల మునిక్రిష్ణ అనే టీడీపీ నేత మోకాళ్లతో విజ్ఞానగిరికి వెళ్లి మొక్కుకున్నారు. భక్తులు మామూలుగానే విజ్ఞానగిరిపై వెళ్లడం చాలా కష్టం. అయితే మాజీ కౌన్సిలరు బీమాల మునిక్రిష్ణ తమ పార్టీ అధినేత కోసం మోకాళ్లపై విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లారు. చంద్రబాబు త్వరగా విడుదల కావాలని స్వామి అమ్మవార్లను వేడుకున్నారు. చంద్రబాబు పేరిట ప్రత్యేక పూజలు చేయించారు.

రైతు సోదరులకు తెలుగుగంగ అధికారుల విజ్ఞప్తి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కండలేరు జలాశయములో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతు సోదరులు వరి నార్లు వేయవద్దని, అధికారులతో సమన్వయం పాటించాలని ఎన్‌టిఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్రమణ్యం ఒక ప్రకటనలో రైతులకు విజ్ఞప్తి చేశారు. కండలేరు జలాశయములో 3.35 టిఎంసిలు (డెడ్ స్టోరేజ్ మినహాయించి) మాత్రమే నీటి లభ్యత ఉందన్నారు. ఈ నీటి లభ్యత తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతుందని అంచనా వేశారు. ఈశాన్య ఋతుపవనాల వలన రాబోవు మాసములలో కండలేరు జలాశయములోకి చేరే నీటి పరిమాణమును దృష్టిలో ఉంచుకొని సాగునీటి సలహామండలి సమావేశము నిర్వహించి, రాబోవు ఖరీఫ్ పంటలకు ఎంతమేర ఆయకట్టుకి సాగునీరు అందజేయగలరో నిర్ణయించబడుతుందని చెప్పారు. కనుక రైతు సోదరులందరూ తొందరపడి నార్లు వేయవద్దని, సమన్వయం పాటించవలసిందిగా ఎన్‌టిఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్రమణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనబాక

విశాలాంధ్ర-కోట:బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనాబాక కోటేశ్వరరావు ఎంపికైనట్లు మంగళవారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పజెప్పిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధరేశ్వరికి,రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.1999 నుండి పార్టీ బలోపేతానికి తాను చేసిన సేవలకు అధిష్టానం గుర్తించి తనకు పదవి బాధ్యతలు అప్పజెప్పడం ఎంతో అభినందనీయమన్నారు.2003-05 ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా 2006-11 ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా 2012-18 ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులుగా 2019-23 సెప్టెంబర్ వరకు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశానన్నారు.ఈ సందర్భంగా పలువురు అభిమానులు కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

భారీ ర్యాలీలో టిడిపి నాయకులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ:- మాజీ ముఖ్యమంత్రి మచ్చలేని చంద్రుడు ముత్యం లాంటి నాయకుడు అక్రమ అరెస్టుల కు నిరసనగా తిరుపతి పట్టణంలో జరిగిన భారీ ర్యాలీలో మంగళవారం మండలతెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు మండల పార్టీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ నీతికి నిజాయితీకి నిలువుటద్దం లాంటి వ్యక్తి నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టారు. నిజాయతీ గల వ్యక్తికి జైల్ జీవితం అవినీతిపరుడుకి ప్రజా జీవితం సైకో పాలన ప్రజలు చూస్తూనే ఉన్నారు, సైకిల్ గెలుపు కోసం ఎదురుచూస్తున్నారు. జగన్మోహన్ రెడ్డికి ప్రజలే తీర్పునిస్తారని వెల్లడించారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు కన్నయ్య నాయుడు, సుందరయ్య, భాస్కర్ యాదవ్, వెంకటాచలం, భూపయ్య, శ్రీనివాసులు, ముని రాజా తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలోని ఎగువ చావాలి గ్రామం వద్ద నేషనల్ హైవేపై కృష్ణపట్నం నుండి బొగ్గులోడుతో రేణిగుంట వెళ్తున్న లారీ నందు ఇద్దరు డ్రైవర్లు ప్రయాణిస్తుండగా అందులో ఒక ఒకరు గుమ్మడి పూండి కి చెందిన ఏలుమలై సురేష్ (36) చావాలి గ్రామం వద్ద సుమారు రాత్రి రెండున్నర గంటల సమయంలో లారీ దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా, ఇంటి నుంచి అలిగి వచ్చాడని తెలుసుకున్న మరో డ్రైవర్ ఇంటికి సమాచారం తెలియజేస్తున్న సమయంలో ఒరిస్సా నుండి రేణిగుంట వైపు అల్యూమినియం లోడుతో వెళ్తున్న లారీ అతన్ని ఢీకొనడతో అక్కడకక్కడే దుర్మరణం చెందాడు. మరణించిన వ్యక్తికి సంవత్సరం క్రిందటి వివాహమైనట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న పెళ్ళకూరు మండల ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలం చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారడు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం:ఎంపిడివో

విశాలాంధ్ర-చంద్రగిరి: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని యంపిడిఓ రమేష్ బాబు అన్నారు. చంద్రగిరి మండలం పనపాకం పంచాయితి జిల్లా పరిషత్ హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపుకు ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం,జూ పార్క్ డైరెక్టర్ మణి యాదవ్,పంచాయతి అధ్యక్షులు పానేటి చెంగల్రాయులు, ఏరియా ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ సి. హెచ్ రెడ్డప్ప, నాయకులు అమాస నాగేశ్వరరావు, నాగ భూషణం,ఢిల్లీశ్వర్, దుర్వాసులు,డాక్టర్ ప్రియాంక,డాక్టర్ కుసుమ, డాక్టర్ లికిత,డాక్టర్ కవిత,యంఇఓ భాస్కర్ బాబు,సెక్రటరీ శిరీష, సచివాలయ సిబ్బంది, రఘు, సుధారాణి,లావణ్య, సేతుమాదవి, ప్రియాంక,యం.గౌరి,తదితరులు పాల్గొన్నారు.